


# మనం
## ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం-మహబూబాబాద్

మంగళవారం | 08 | ఆగష్టు | 2023 | పేజీలు : 7


# పట్టు బట్టి, జట్టు కట్టి..

**అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించుకున్నం**
**ప్రగతి రథ చక్రాలు ఎప్పటికీ ఆగవు..**
**ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కేసీఆర్ నిర్ణయం ఫలించింది.**
**ఎన్నో ఏళ్ల కల మున్నేరు ఆర్‌సిసి వాల్**
**శాశ్వత పరిష్కారం కోసమే రూ.150 కోట్లు మంజూరు**
**రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**
**ఘన స్వాగతం పలికిన మున్నేరు నిర్వాసితులు, ఆర్‌టిసి శ్రేణులు..**

**ఖమ్మం, ఆగష్టు 7(మనం బ్యూరో):** రాష్ట్రంలో పేదల రవాణా సౌకర్యన్ని మరింత పటిష్ట పరచి, మరింత మెరుగు చేసేందుకే టిఎస్ ఆర్టీసి ని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రత్మికమైన నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. రూ.150 కోట్లతో మున్నేరు ఆర్‌సిసి కాంక్రీట్ వాల్ నిర్మాణం, అసెంబ్లీలో ఆర్టీసి ని ప్రభుత్వంలో విలీనం అనంతరం మొదటి సారి ఖమ్మం విచ్చేసిన సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కి మున్నేరు బ్రిడ్జి వద్ద భారీ సంఖ్యలో మున్నేరు ముంపు బాధితులు, ఆర్టీసి ఉద్యోగులు, బిఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 43 వేల మంది ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రికి మనం ఎప్పటికి రుణపడి ఉండాలని కోరారు. ఖమ్మం మున్నేరు పై బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు ఇప్పటికే రూ.180 కోట్లు మంజూరు అయ్యాయని, ఇప్పుడు తాజాగా పేదలను మున్నేరు



వరద ముంపు నుండి రక్షించేందుకు ముఖ్యమంత్రి కేసీఅర్‌కి నివేదించగా తక్షణమే రూ.150 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని, కేవలం ప్రజల సంక్షేమం మాత్రమే ఆశిస్తున్నదని అన్నారు. అనంతరం వీడియోస్ కాలనీలోని మంత్రి కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు పెద్దెత్తున పాల్గొన్నారు.

# వనమా‘కు సుప్రీంకోర్టులో ఊరట



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 7 (మనం ప్రతినిధి):** కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణ హైకోర్టు తన ఎన్నిక చెల్లదంటూ, తనను అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు నాలుగు వారాల పాటు స్టే విధించింది. సోమవారం సుప్రీం కోర్టులో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తల ధర్మాసనం కేసును విచారించింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన వనమా వెంకటేశ్వరరావు తాను ఎన్నికల కమీషన్ కు సమర్పించిన అఫిడవిట్ లో తప్పుడు సమాచారం సమర్పించారని, ఈ కారణంగా వనమాను అనర్హుడిగా ప్రకటించాలని, 2018 ఎన్నికల్లో వనమాపై టిఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసి రెండవ స్థానంలో నిలిచి స్వల్ప తేడాతో ఓడిపోయిన మాజీ ఎంఎల్‌ఏ జలగం వెంకటరావు 2019లో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రెండేళ్ళ పాటు కరోనా ప్రభావంతో కోర్టులు పాక్షికంగా పనిచేసిన సందర్భం, ఇతరత్రా కారణాలతో ఈ కేసు సుదీర్ఘకాలంగా నడిచి చివరకు గత జూలై 25 న వనమాను అనర్హుడిగా ప్రకటిస్తూ, 5 లక్షల రూపాయల జరిమానా విధిస్తూ హైకోర్టు తన తీర్పు వెలువరించింది. కాగా కాంగ్రెస్ పార్టీ నుండి విజయం సాధించిన వనమా టిఆర్‌ఎస్ లో చేరి ప్రస్తుతం బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏగా కొనసాగుతున్నారు. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ లో తప్పుడు వివరాలు సమర్పించారని, తనపై వేసిన పిటిషన్ ను డిస్మిస్ చేయాలని వనమా హైకోర్టును ఆశ్రయించారు. కానీ అప్పటి న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్ రెడ్డి వనమా అభ్యర్థినతో ఏకీభవించలేదు. దీంతో ఈ వ్యవహారం సుప్రీం వరకు వెళ్ళింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ 2021 నవంబర్ లో కేసును విచారించి, ఈ కేసు విషయమై తెలంగాణా హైకోర్టునే ఆశ్రయించాలని ఆదేశించడంతో, తిరిగి ఈ కేసు తెలంగాణ హైకోర్టులో విచారణకు వచ్చింది. చివరకు జూలై నెలలో వెలువరించిన తీర్పులో 2018 ఎన్నికలలో వనమా చేతిలో ఓటమి చవిచూసి రెండవ స్థానంలో నిలిచిన కొత్తగూడెం మాజీ ఎంఎల్‌ఏ జలగం వెంకటరావును 2018 నుండి ఎంఎల్‌ఏగా పరిగణించాలని, తీర్పు వెలువడిన సమయం నుండి వనమా ఎంఎల్‌ఏ గా అనర్హుడని స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కేవలం 4లో..

# కేసీఆర్ కు సీఎం హోదా సోనియమ్మ భిక్ష

**– రాబోవు ఎన్నికల్లో ఫామ్ హౌస్ కే కల్వకుంట్ల కుటుంబం పరిమితం**
**– తెలంగాణ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
**– ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఐఎన్‌టీ యూసీ ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం**
**– ఆపదలో అండగా ఉంటానని హామీ ఇచ్చి హెల్త్ కార్డులు పంపిణీ**





**ఖమ్మం, ఆగష్టు 7(మనం బ్యూరో) :** కేసీఆర్ కు సీఎం హోదా కాంగ్రెస్ అధినేత్రి సోనియమ్మ భిక్ష అని తెలంగాణ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఆమె పెట్టిన భిక్షతోనే నేడు ఆ సీట్లో కూర్చొని అధికార మదాన్ని ప్రదర్శిస్తున్నాడని విమర్శించారు. ఖమ్మం నగరంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో సోమవారం జరిగిన ఐ ఎన్ టీ యూ సీ ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పొంగులేటి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ యూనియన్లో లేరనే నెపంతో తమ యూనియన్ ఆటో డ్రైవర్ల పై అధికార పార్టీ పెట్టే ఇబ్బందులు, వేధింపులను ఎదుర్కొనేందుకు కొత్తగా లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా అధికార పార్టీ నేతల వేధింపులను న్యాయపరంగా ఎదుర్కొనేందుకు అయ్యే ప్రతి ఖర్చు ఇక నుంచి పార్టీ తరుపున తానే భరిస్తానని తెలిపారు. అదేవిధంగా కిమ్స్ ఆసుపత్రి తరుపున 50 శాతం రాయితీతో కూడిన హెల్త్ కార్డులను ఇస్తున్నట్లు ప్రకటించి వెంటనే వాటి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా యూనియన్ లతో సంబంధం లేకుండా ప్రతి ఆటో డ్రైవర్కు పార్టీ తరుపున ఇన్సూరెన్స్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియ తక్షణమే అమల్లోకి వస్తుందన్నారు. ఆటో డ్రైవర్ సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆటో డ్రైవర్ సోదరులకు ఖాకీ చొక్కాలను పంపిణీ చేయడంతో పాటు బీఆర్‌ఎస్ కెవీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్ష పదవికి రాజీనామ చేసిన సత్తార్ మియాను, మరికొంత మంది బీఆర్‌ఎస్, ఇతర పార్టీల ఆటో యూనియన్ నాయకులను, ఆటో డ్రైవర్లను ఐ ఎన్ టీ యూ సీ కండువా కప్పి ఆహ్వానించారు.

**– రాబోవు ఎన్నికల్లో ఫామ్ హౌస్ కే కల్వకుంట్ల కుటుంబం పరిమితం**

సమావేశ ప్రారంభానికి ముందు ప్రజా గాయకుడు గద్దర్ కు రెండు నిమిషాల పాటు నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ఫామ్ హౌస్ కే కల్వకుంట్ల కుటుంబం పరిమితం అవ్వడం ఖాయమన్నారు. ఎన్నికలకు ముందే కేసీఆర్ కు ఆర్టీసీ ఉద్యోగులు, రైతులు గుర్తుకొచ్చారా అని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు ఎన్నో ఉన్నా వాటన్నింటిని పక్కన పెట్టి ఈ రెండిటిపైనే దృష్టిసారించడం విడ్డూరమన్నారు. రైతులకు రుణమాఫీ ప్రకటన చేసి తొమ్మిదేళ్లు దాటిందన్నారు. ఆర్టీసీ కార్మికులు 2లో..

# ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్

**ఖమ్మం, ఆగష్టు 7(మనం బ్యూరో) :** ప్రజ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మదుసూదన్ నాయక్‌తో కలిసి ''గ్రీవెన్స్ డే''లో అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా తల్లాడ మండలం ముద్దునూరుకు చెందిన ఇమ్మడి రామకృష్ణ తాను ముద్దునూరు గ్రామ పంచాయితీలో ఎంపిడబ్ల్యూగా విధులు నిర్వర్తించే వాడినని తనను అకారణంగా విధుల నుండి తొలగించడం జరిగిందని, తనకు న్యాయం చేయాల్సిందిగా హైకోర్టును ఆశ్రయించడం జరిగినదని 08-06-2023న కోర్టు ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని అయినప్పటికి కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం జరగలేదని తనకు న్యాయం చేకూర్చాల్సిందిగా సమర్పించిన దరఖాస్తును 24 గంటల వ్యవధిలోచర్యలు తీసుకొని నివేదిక సమర్పించాల్సిందిగా జిల్లా పంచాయితీ అధికారిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. చింతకాని మండలం గాంధీనగర్ కాలనీకి చెందిన బీమరాజు నాగసరిత తాను ఓటరు కార్డుకు దరఖాస్తు చేసుకోవడం జరిగినదని తనకు ఓటరు కార్డుకై చేసిన దరఖాస్తును సంబంధిత తహశీల్దారు ఇప్పటి వరకు ఏ కారణం చేత ఓటరు ఐడి కార్డుకు దరఖాస్తు చేయలేదనే కారణంతో అట్టి దరఖాస్తును తిరస్కరించారని, విచారణ చేసి తనకు ఓటరు ఐడి కార్డు ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చింతకానిని ఆదేశించారు. రామకృష్ణాపురం గ్రామం చింతకాని మండలంకు చెందిన శనగవరపు శ్రీనివాస్ తాను బి.సి (కుమ్మరి) కులమునకు చెందిన వాడనని తాను ఆన్లైన్లో కులవృత్తి దారుల ఆర్థిక సహాయంకై దరఖాస్తు చేసుకొన్నానని మంజూరు అయినట్లు తెలిపినారు కాని నాకు చెక్కు అందలేదని తాను వికలాంగుడినని తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం మండల పరిషత్తు అభివృద్ధి అధికారి



చింతకానికి ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిల్ నందు శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమకు ఇచ్చే స్టయిఫండ్, స్టడీ మెటీరియల్ రెండు నెలలుగా అందించడం లేదని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి గ్రామంకు చెందిన బొల్లినేని సీతమ్మ భర్త బొల్లినేని రోషయ్య (లేటు) తమకు గల వ్యవసాయ భూమిని ముగ్గిరు కుమారులకు ఒక్కొక్కరికి ఐదు ఎకరముల చొప్పున ఇవ్వడం జరిగినదని, ఇప్పు తన కొడుకులు తన బాగోగులు పట్టించుకోవడం లేదని, 13 కుంటల భూమి తన భర్త పేరున ఉన్నదని అట్టి భూమిని, ఖాతాలో గల లక్ష రూపాయలను తన పేరున మార్పు చేయగలరని సమర్పించిన దరఖాస్తును సీనియర్ సిటిజన్స్ యాక్టు క్రింద తగు చర్య నిమిత్తం రెవెన్యూ డివిజనల్ అధికారి, ఖమ్మంను ఆదేశించారు. ఖమ్మం నగరం నిజాంపేటకు చెందిన దొనగిరి బాలరాజు తన తాత, తండ్రి గారికి సంబంధించిన ధంసలాపురం రెవెన్యూ పరిధిలో సర్వేనెం.28/లులో 2 ఎకరములు 0.07 గుంటల భూమి కలదని అట్టి భూమికి సంబంధించి 2000ఖు21 నుండి 2004ఖు05 వరకు పహణిలో నమోదు కావడం జరిగినదని అట్టి భూమిని వారసత్వ పౌతి పట్టా దారు పుస్తకము ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఖమ్మం అర్బన్ తహశీల్దారును ఆదేశించారు. 'గ్రీవెన్స్ డే'లో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా యుద్ధనౌక గద్దర్ కు సిపిఎం నివాళి

**భద్రాచలం, ఆగష్టు 7 (మనం న్యూస్ ):** ప్రజా గాయకుడు, యుద్ధ నౌక కామ్రేడ్ గద్దర్ కు సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. గద్దర్ చిత్రపటానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు



పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గద్దం స్వామి మాట్లాడుతూ ప్రజా గాయకుడిగా గద్దర్ పాడిన పాటలు ప్రజల్లో చైతన్యాన్ని రగిలించాయని అన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజల తిరుగుబాటుకు భయపడి పారిపోయిన నైజాం దొర సన్నివేశాన్ని కళ్ళకు కట్టినట్లు 'బండెనక బండి కట్టి... 16 బండ్లు కట్టి... ఏ బండ్లో పోతావ్ కొడకో... నైజాము సర్కరోడా... సాగే పాట ప్రజల్లో భావిద్వేగాన్ని రగిలించిందని అన్నారు...సామాజికంగా దోపిడీకి గురైన వర్గాలకు గొంతుకగా మారి ఆయన పాడిన పాటలు సామాజిక చైతన్యాన్ని రగిలించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు చేగుండి శ్రీనివాస్, నకిరికంటి నాగరాజు, కోరాడ శ్రీనివాస్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

# మిషన్ ఇంద్రధనస్సును ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగష్టు 7 (మనం ప్రతినిధి) :** పాల్వంచ మండలం ఇందిరానగర్ ప్రాథమిక వైద్య కేంద్రంలో సోమవారం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ప్రారంభించారు. మిషన్ ఇంద్ర ధనుష్ టీకా



కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరు టీకాలు వేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నేటి నుండి 12 వ తేదీ వరకు మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించుకోని 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలను, గర్భిణీలను గుర్తించడం జరిగిందని, ఇప్పటి వరకు టీకాలు వేయించుకోని పిల్లలను, గర్భిణీలను, మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రత్యేక సెషన్లలో టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు.

# ప్రజా గాయకుడు కామ్రేడ్ గద్దర్ కు లాల్ సలాం..

## సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు.

**ఖమ్మం, ఆగస్ట్ 7(మనం బ్యూరో):** ప్రజా గాయకుడు విప్లవోద్యమాలకు స్ఫూర్తి సామాజిక ఉద్యమాలలో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్ గద్దర్ అనారోగ్యంతో మృతి చెందటం సామాజిక ఉద్యమాలకు, ప్రజా కళాకారులకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, దశాబ్దాల తరబడి బూర్జువా, భూస్వామ్య పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించిన విప్లవకారుడు గద్దర్ అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం లోని పెవిలియన్ గ్రౌండ్ తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కామ్రేడ్ గద్దర్ చిత్రపటానికి పూలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ గద్దర్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత బ్యాంకు ఉద్యోగం మానేసి సామాజిక ఉద్యమాలలో విప్లవోద్యమంలో దీర్ఘకాలం పని చేశారని, తన ఆట పాటతో విప్లవ గీతాలు ఆలపించేవాడని, అనేక మంది యువతను ఆకర్షించి విప్లవోద్యమంలో పయనింప చేశాడని, ఆ తర్వాత కాలంలో సామాజిక అభ్యుదయ ఉద్యమాల వైపు వచ్చారని అన్నారు. అనేక అభ్యుదయ సినిమాలలో గొప్ప పాటలు రచించారని, తన విప్లవ పాటలు ప్రజలను ఎంతో ఉత్తేజపరిచాయని అన్నారు. కామ్రేడ్ గద్దర్ మరణించడం



ప్రజాస్వామ్య వాదులకు, సమాజానికి తీరని లోటని, వారి కుటుంబానికి సిపిఎం పార్టీ తరపున సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, సిపిఎం పార్టీ జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, ఎస్.నవీన్ రెడ్డి, వై.శ్రీనివాస్రావు, బోడపట్ల సుదర్శన్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సదానందం, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటి సభ్యులు చింతల రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, మహిళా సంఘం నాయకురాలు భాగం అజిత, నాగేశ్వరరావు, వెంకటాద్రి, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



# పరీక్షలు లేకుండా రెండో ఏఎన్ఎంలను క్రమీబద్ధీకరించాలి

## కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నిరసన

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగష్టు 7 (మనం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి పరీక్షలు లేకుండా విఆర్ఏ, కాంట్రాక్టు లెక్చరర్స్, సెర్ప్ ఉద్యోగులను ఎలా సర్వీస్ క్రమబద్ధీకరించారో, హెల్త్ డిపార్ట్మెంటులో పదహారు ఏళ్లుగా పనిచేస్తున్న నాలుగు వేల మంది రెండో ఏఎన్ఎంలను ఎలాంటి పోటీపరీక్షలు లేకుండా సర్వీస్ సీనియారిటీ ఆధారంగా క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన నినాదాలు చేసిన అనంతరం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరును కలిసి 300 మంది రెండో ఏఎన్ఎంలు వ్యక్తిగత దరఖాస్తులు జాబ్ క్రమబద్ధీకరణ కోసం అందించారు. 16 ఏళ్ల సీనియారిటీ ఉన్న వారిని కాదు అని హెల్త్ మినిస్టర్ హరీష్ రావు కొత్త నోటిఫికేషన్ ఎలా ఇస్తారు అని ప్రశ్నించారు. ఈ తెలంగాణలో సర్వీస్ కు సీనియారిటీకి గుర్తింపు లేదా అని ప్రశ్నించారు. పనులు భారం ఎక్కువ మోపి ఏఎన్ఎంలను శ్రమ దోపిడీ చేస్తున్నారని, కనీసం వేతనంతో కూడిన ప్రసూతి సెలవలు కూడా ఇవ్వని దుర్మార్గపు ప్రభుత్వం తెలంగాణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బానోత్ ప్రియాంక , ఎండి. సజ్జు బేగం , పుష్ప, బాల నాగమ్మ, వెంకటరమణ, పార్వతి, రాములమ్మ, కౌసల్య , ఇందిర, జ్యోతి తదితరులు ;పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు సీఎం హోదా...

(మొదటి పేజీ తరువాయి)

సమ్మె చేస్తున్న సమయంలో వారిని దూషించిన ముఖ్యమంత్రి నేడు వారిపై కపట ప్రేమ చూపించడం తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. దళిత బంధు, బీసీ బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇలా ఎన్నో హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ విషయాన్ని కేసీఆర్ గ్రహించి ఎన్నికల స్టంట్ లను ప్రదర్శిస్తున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు రెండు లక్షల రూపాయాల రుణమాఫీతో పాటు ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తీసుకుంటుందన్నారు. ఐ ఎన్ టీ యా సీ జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ ఛైర్మన్ కోరం కనకయ్య, ఖమ్మం డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, పార్టీ రాష్ట్ర నాయకురాలు బేబి స్వర్ణకుమారి, మాజీ డీసీసీబీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మిక్కిలినేని నరేంద్ర, దొడ్డా నగేష్ యాదవ్, మలీదు జగన్, ఎం.డీ. ముస్తఫా, పల్లెబోయిన చంద్రయ్య, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, దుంపల రవికుమార్, మియాభాయ్, ఇమామ్ భాయ్, కొంగర జ్యోతిర్మయి, బోడ శ్రావణ్ కుమార్, కొప్పెర ఉపేందర్, ఐ ఎన్ టీ యా సీ జిల్లా ప్రధాన కార్యదర్శి పమ్మి వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు, సిహెచ్. విప్లవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడకండి అండగా నేనున్నా..

## మాజీ ఎంఎల్ఏ పాయం

## వరద బాధితులకు నిత్యవసరాలు పంపిణీ..



**కరకగూడెం ఆగస్టు 7 (మనం న్యూస్):** కరకగూడెం మండలంలోని నర్సంపేట ఎస్సీ కాలనీ, వెంకట్రావుపురం, రఘునాథపాలెం, మోతె గ్రామలలో వర్షాల వలన వరదలు వచ్చి ఇళ్ళులు కోల్పోయిన బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులను పినపాక మాజీ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆయన అన్నారు. నష్టపోయినటువంటి వరద బాధిత కుటుంబాలకు, రైతులకు నష్టపరిహారం వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి నియంత పాలనను ప్రజలు గమనిస్తున్నారని వారే తగిన బుద్ధి చెప్తారని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని, 500 రూపాయలకే వంట గ్యాస్ అందిస్తామని, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తామని మరెన్నో పథకాలు ప్రవేశపెడతామని తెలిపారు. అనంతరం వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి దెబ్బతిన్న రోడ్లు బ్రిడ్జి లు కూలిపోయిన ఇండ్లను పరిశీలించారు. కరకగూడెం చిరుమళ్ళ గ్రామాల మధ్య ఉన్న పెద్ద వాగు ప్రధాన రహదారి కోతకు గురై పది రోజులు కావస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎనిమిది గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కరకగూడెం మండలం జడ్పిటిసి కొమరం కాంతారావు, సర్పంచ్ తోలెం నాగేశ్వరరావు,ఉప సర్పంచ్ కొమరం వెంకటేశ్వర్లు,కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ కునుసోద్ సాగర్,నాయకులు యర్ర సురేష్,పడిగా సమ్మయ్య,జలగం కృష్ణ,గోగ్గల రవి,భూక్య రాందాస్,పూజారి వెంకన్న,తాళ్ళూరి శేషగిరిరావు,కొమరం వెంకన్న, దేంచనాల రాజేంద్రప్రసాద్,కరకపల్లి నాగేష్,కొమరం నాగభూషణం,జాడే శ్రీను,సోలం రామకృష్ణ,బిజ్జ స్వామి,గోగ్గల నర్సింహారావు,కొరకట్ల నరేందర్,కోరం లాలయ్య,ఉకే కేశవరావు,భూక్య,మంత్, పాయం నర్సింహారావు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



# బీపీ మండల్ డే ని అధికారికంగా జరపాలి

## బీపీ మండల్ ను భారత రత్న తో సత్కరించుకోవాలి

## జనాభా ప్రాతిపదికన బీసీలకు సీట్లు ఇవ్వాలి

## బీపీ మండల్ కు ఘనంగా నివాలర్పించిన అఖిల భారత యాదవ్ మహాసభ నాయకులు చిత్తారు సింహాద్రి యాదవ్



**ఖమ్మం, ఆగస్టు 07(మనం న్యూస్) :** బీసీ ల కోసం పాటుబడిన బీపీ మండల్ జయంతి, వర్ధంతిని బీపీ మండల్ డే గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యాదవ్ మహాసభ ఖమ్మం జిల్లా నాయకులు, జిల్లా టెలికాం సలహా మండలి సభ్యులు చిత్తారు సింహాద్రి యాదవ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సోమవారం సంఘ కార్యాలయంలో బీపీ మండల్ చిత్ర పటానికి పూల మాల వేసి, ఘనంగా నివాలర్పించారు.ఈ సందర్భంగా చిత్తారు సింహాద్రి యాదవ్ మాట్లాడుతూ బీసీ ల అభ్యున్నతికి ఎంతో శ్రమించిన బీపీ మండల్ ను భారత రత్న తో సత్కరించుకోవాలని పేర్కొన్నారు.రాష్ట్రంలో గతంలో బీసీ లకు స్థానిక సంస్థల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లు ను వెంటనే పునరుద్ధరించాలని , లేని పక్షంలో బీసీ కులాలను కలుపుకొని ఉద్యమ బాట పడతామని స్పష్టం చేశారు. ఇది ఎన్నికల సంవత్సరమని,ప్రతి పార్టీకి ఈ విషయంలో బాధ్యత ఉందని అన్నారు. బీసీ జనాభా ప్రకారం సీట్లు కేటాయించాలని, రిజర్వేషన్లు వివరాలు కూడా తమ మేనిఫెస్టోలో పొందుపర్చాలని అన్నారు.ఎన్నికల నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కుల జన గణను చేపట్టాలని చిత్తారు కోరారు ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య యాదవ్ బుల్లి కొమరయ్య యాదవ్ కనక బండి విజయలక్ష్మి యాదవ్ పొదిల సతీష్ యాదవ్ బండారు ప్రభాకర్ యాదవ్ సత్తి వెంకన్న యాదవ్ రాజమంటి వంశీ యాదవ్ కన్నబోయిన రవి యాదవ్ వాక్కదాని కోటేశ్వరరావు యాదవ్ బంకు మురళి రాగం కోటేశ్వరరావు యాదవ్ బాబురావు యాదవ్ నరసింహారావు పొదిలి భూపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# కరుణానిధికి నామ ఘన నివాళి



**ఖమ్మం, ఆగస్టు 07(మనం న్యూస్):** డీఎంకే మాజీ ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సోమవారం పార్లమెంట్ లోని ఆ పార్టీ కార్యాలయంలో కరుణానిధి చిత్ర పటానికి పూల మాల వేసి, శ్రద్ధాంజలి ఘటించి, ఘనంగా నివాల ర్పించారు.పేదలు, అట్టడుగు వర్గాల సంకేమం కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. తమిళనాడు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించడమే కాకుండా తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రజారంజక పాలన అందించారని అన్నారు. పరిపాలనలో కరుణానిధి తనదైన ముద్ర వేశారని నామ కొనియాడారు. ప్రజలకు మంచి సుపరిపాలన అందించిన ఘనత కరుణానిధి కే దక్కుతుందని పేర్కొన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి, ప్రజల ప్రేమాభిమానాలను సొంతం చేసుకున్నారని అన్నారు.60 ఏళ్ల రాజకీయ జీవితంలో పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లోనూ గెలిచి రికార్డ్ సృష్టించి, గిన్నిస్ రికార్డుకు ఎక్కారని తెలిపారు. తమిళ సాహిత్యం లో కూడా తనదైన ముద్ర వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ లోక్ సభా, రాజ్యసభ ఎంపీలు సంతోష్ కుమార్, మాలోత్ కవిత, బీవీ పాటిల్, సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర , దివికొండ దామోదర్ రావు, పోతుగంటి రాములు, కొత్త ప్రభాకర్ రెడ్డి, బాడుగుల లింగయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షానికి నేలకొరిగిన రెండు మహావృక్షాలకు పునర్జన్మ

## – విజయవంతంగా భారీ వృక్షాల ట్రాన్స్ లొకేషన్

## – సింగరేణి డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) ఎన్ బలరాం చొరవ





**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 7 (మనంప్రతినిధి) :** పర్యావరణ హిత చర్యలకు పెట్టింది పేరుగా ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మొక్కల పెంపుదలకు, వృక్షాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు ఈదర గాలులకు కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో గల 6 దశాబ్దాల నాటి భారీ మర్రి వృక్షం ఒకటి నేలకు ఒరిగి పోగా పర్యావరణహితుడు, వన ప్రేమికుడైన డైరెక్టర్ ఫైనాన్స్ మరియు పర్సనల్ ఎన్ బలరాం సూచనల మేరకు ఈ వృక్షాన్ని లోపలి వేర్లతో సహా జెసిబితో పెకిలించి, భారీ క్రేన్ సాయంతో ట్రక్కులోనికి ఎక్కించి, కొత్తగూడెం బంగ్లోస్ ఏరియాలో ని గెస్ట్ హౌస్ ప్రదేశానికి ట్రాన్స్ లొకేట్ చేశారు. అలాగే షటిల్ కోర్టుకు పక్కనే ఉన్న మరో 50 ఏళ్ల వయసున్న భారీ దిరిసినం వృక్షం నేలకు పడిపోగా దానిని కూడా ఇదే మాదిరిగా షటిల్ కోర్టు వెనుక వైపు కి ట్రాన్స్ లొకేట్ చేశారు. గతంలో రామగుండం– 1 ఏరియా లో కూడా ఇదే విధంగా కొత్త ఓపెన్ కాస్ట్ గని ప్రాంతంలో గల పాతికేళ్ళ వయసుగల వృక్షాలను కూడా ఇదే విధంగా వేర్లతో సహా తొలగించి వేరే చోట ప్రతిష్ఠించడం జరిగింది. ఇప్పుడు ఆ చెట్లు తిరిగి వృక్షాలుగా ఆరోగ్యంగా ఎదుగు తున్నాయి . కొత్తగూడెంలో వృక్షాల పునః ప్రతిస్తాపనకు కృషి చేసిన అధికారులు సిబ్బందికి డైరెక్టర్ ఫైనాన్స్ మరియు పర్సనల్ ఎన్. బలరామ్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# వాగొడ్డుగుడెం ఆదివాసీల భూములకు సర్వే చేసి హక్కు పత్రాలు ఇవ్వాలి

## కోర్టు ఉత్తర్వులను అధికారులు అమలు చేయకపోవడం దారుణం – అధికారుల మీద కోర్టు ధిక్కారణ కేసులు నమోదు చేయాలి

## అశ్వారావుపేట ఆదివాసి ఎమ్మెల్యే అభ్యర్థి ఊకే రవి



**అశ్వారావుపేట టౌన్, ఆగష్టు 07(మనం న్యూస్ ) :** అశ్వారావుపేట మండలం వాగొడ్డుగుడెం పోడు భూమిని సేద్యం చేస్తున్న గ్రామ ఆదివాసీలకు సర్వే చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని, పొజిషన్లో లేరనే సాకు తోటి సర్వే చేయకుండా ఆదివాసి హక్కులను ఫారెస్ట్, ప్రభుత్వ అధికారులు హరిస్తున్నారని ఆదివాసీ ఎంఎల్ఏ అభ్యర్థి ఊకే రవి పేర్కొన్నారు. ఇప్పటివరకు వాస్తవ సాగులో ఆదివాసీలే పొజిషన్లో ఉన్నారని, అధికారులు క్షేత్రస్థాయికి రాకుండా విచారణ చేయకుండా సాగులో లేరని వారికి హక్కులు లేవు అని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై వాగొడ్డు గూడెం గ్రామ ఆదివాసీలు హైకోర్టును ఆశ్రయించగా వారికి అనుకూలంగా చట్ట ప్రకారంగా సర్వే చేసి ప్రోసెస్ మొదలు పెట్టి చేయాలని, అలాగే హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోర్టు ఉత్తర్వులు వెలువరించినా ఇప్పటివరకు అధికారులు సర్వే చేయకపోవడం సరికాదన్నారు. కోర్టుల పట్ల గౌరవం లేకుండా వాటిని అవమానిస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణమే అధికారుల మీద కోర్టు దిక్కరణ కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుమన్ కార్యదర్శి పునెం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు భేతి రమేష్ జిల్లా నాయకులు కురుసం బాబురావు కనితి వెంకటేశు రైతుసేన మండల అధ్యక్షులు కొరస వెంకటేష్ కార్మిక సేన మండల అధ్యక్షులు కొరస సహదేవుడు మహిళా సేన అధ్యక్ష కార్యదర్శులు పార్వతి బేతి నాగమ్మ విద్యార్థి సేన అధ్యక్షులు సొడెం సీతయ్య, నాయకులు కొర్స అర్జున్,గంగరాజు, గ్రామస్తులు వివిధ గ్రామాలకు సంబంధించినటువంటి పోడు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# విప్లవోద్యమ వేగుచుక్క గద్దర్

## భవిష్యత్ తరాలకు స్ఫూర్తి ప్రధాత

## గద్దర్ సంస్మరణ సభలో ఐజేయు నేత రాంనారాయణ

**ఖమ్మం, ఆగస్టు 7(మనం బ్యూరో):** తుదిశ్వాస వరకు ప్రజా ఉద్యమాలలో పని చేసి సామాజిక చైతన్యానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన గళాన్ని, కలాన్ని సంధించిన ప్రజా ఉద్యమ వేగుచుక్క గద్దర్ అని టియుడబ్ల్యూజె (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ తెలిపారు. ప్రజా ఉద్యమాలు జరిగినంత కాలం ప్రశ్నించే గొంతుక ఉన్నంత కాలం నిత్యం గద్దర్ స్మరించబడతారని ఆయన తెలిపారు. ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ సంస్మరణ సభ సోమవారం టియుడబ్ల్యూజె (ఐజేయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్లో జరిగింది. ఐజెయు నగర అధ్యక్షులు పాపారావు అధ్యక్షతన జరిగిన సభలో రాంనారాయణ మాట్లాడుతూ యుక్త వయస్సులోనే తొలి దశ తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాల్గొన్నారని జైలు జీవితాన్ని సైతం అనుభవించారన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన ఉద్యోగాన్ని వదులుకుని సాయుధ పోరాట బాట పట్టారని విప్లవోద్యమంలో అనేక కష్ట, నష్టాలను ఎదుర్కొన్నారని రాంనారాయణ తెలిపారు. గద్దర్ పాటలు తూటాల్లా పేలేవని ప్రజల్లో చైతన్యం రగిలిస్తే పాలకుల్లో ఆందోళనలు కలిగించాయని రాంనారాయణ తెలిపారు. గద్దర్ పాట నిత్యం చైతన్య స్ఫూర్తి అని అట్టడుగు వర్గాల ప్రజా జీవితాన్ని తన పాటలతో, తన మాటలతో కళ్లకు కట్టినట్లు చూపించిన మహానీయుడన్నారు. గద్దర్ చరిత్ర ఈ తరాలకే కాదు భవిష్యత్ తరాలకు కూడా స్ఫూర్తి నిచ్చేవిధంగా పాఠ్యాంశాలలో చేర్చాలని, గద్దర్ స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు. గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును తన పాటలతో చూపించిన గద్దర్ అమరుడని ప్రజాపాట బతికి ఉన్నంత కాలం గద్దర్ ప్రజల గొంతుల్లో పాటై వినిపిస్తాడని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో సమాచార వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని కానీ ఈ మార్పులు రాక ముందే పాలకుల



వైఫల్యాలను, ప్రజల ఇబ్బందులను తన ఆట, పాట ద్వారా మారుమూల పల్లెలకు సైతం చేరవేసిన అతిగొప్ప జర్నలిస్టు గద్దర్ అని ఆయన తెలిపారు. సభకు ముందు గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్దర్ మృతికి సంతాప సూచికగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ప్రెస్ క్లబ్ కార్యదర్శి కూరాకుల గోపి ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించగా టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వర రావు, మాటేటి వేణుగోపాల్, సర్వనేని వెంకట్రావు, ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, నలజాల వెంకట్రావు, మోహినుద్దీన్, వై.మాధవరావు, ఖమ్మం ప్రెస్‌క్లబ్ కోశాధికారి నామ పురుషోత్తం, కె. వెంకటేశ్వర్లు, సంతోష్, భరత్ తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు సామినేని కృష్ణ మురారి, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్, వివిధ పత్రికలు ఛానెళ్ల బాధ్యులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఏలూరి వేణుగోపాల్, బసవేశ్వరరావు, గడల నర్సింహారావు, మేడి రమేష్, కళ్యాణచక్రవర్తి, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు. ఆర్అండ్ నుంచి ప్రెస్క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

# స్వలాభం కోసమే కందాల పార్టీ మారారు

## – పార్టీ మారని వారిపై అధికార మదంతో అక్రమ కేసులు బనాయింపు

## – బీఆర్ఎస్ కు కాలం చెల్లే రోజులు వచ్చాయి

## – కూసుమంచి పర్యటనలో తెలంగాణ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం, ఆగస్టు 7(మనం బ్యూరో):** స్వలాభం కోసమే పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అధికార పార్టీలోకి చేరారని తెలంగాణ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు. కూసుమంచి మండల పర్యటనలో



భాగంగా ముత్యాల గూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కందాల పోటీ చేసిన సమయంలో ఎవరైతే ఆయన గెలుపునకు కృషి చేశారో వారంతా ఆయనతో పాటు అధికార పార్టీలోకి చేరలేదనే కోపంతో వారికున్న అధికార మదాన్ని ప్రయోగించి వారిపై అక్రమ కేసులను పెట్టించి జైళ్లకు పంపించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ కు కాలం చెల్లే రోజులు వచ్చాయని మరో మూడు నెలల్లో ప్రజల ఆశీస్సులు, దీవెనలతో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ గోడకు సున్నం కొట్టినంత సులువుగా అబద్ధాలు ఆడుతున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం బీఆర్ఎస్ చేస్తున్న స్టంట్లు అన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ప్రజలు ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు. అంతకుముందు పొంగులేటికి చేగొమ్మ గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మలీదు సత్యనారాయణ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన తేనేటి విందులో పాల్గొన్నారు. అదేవిధంగా ముత్యాలగూడెంలో మంకెన వాసును పరామర్శించారు. పలు ప్రయివేటు కార్యక్రమాల్లోనూ పొంగులేటి పాల్గొన్నారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, రామసహాయం నరేష్ రెడ్డి, రాయల నాగేశ్వరరావు, సుడిగాలి కిషన్ రావు, కన్నెటి వెంకన్న, సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, బజ్జూరి వెంకట రెడ్డి, బొలికొండ శ్రీను, బొలికొండ రామకృష్ణ, పుల్లా రెడ్డి, సురేందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, నర్రా సీతారాములు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

# ప్రజా గాయకుడు గద్దర్ కు టీజేఎఫ్ ఘన నివాళి

## – తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన గళం చిరస్మరణీయం

## – తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి

**ఖమ్మం, ఆగస్టు 7(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలి దశ ఉద్యమాల్లో ప్రజా యుద్ధనౌక గద్దర్ వినిపించిన గళం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి అన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి పట్ల టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సంతాపసభ ఏర్పాటుచేసి గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జర్నలిస్టులు ఘన నివాళులర్పించారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన గద్దర్ సంతాప సభలో యూనియన్ జిల్లా నాయకులు చిర్రా రవి మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గద్దర్ ఆడి, పాడి జాతిని మేల్కొల్పి ఉద్యమానికి ఆయు పట్టు అయ్యాడని, రాష్ట్ర సాధన కోసం ఆయన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.గద్దర్ విద్యార్థి దశ నుండి ఆయన రాసిన పాటలు ఆడిన ఆటలు సబ్బండ వర్గాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాయన్నారు. రాజకీయాలకతీతంగా గద్దర్ దేశవ్యాప్త ప్రజాభిమానాన్ని చూరగొన్నాడని అన్నారు. అటువంటి మహానీయుడికి జర్నలిస్టులు ఘన నివాళులు అర్పిస్తున్నారన్నారు. ఈ



కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ విజేత, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరావు, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, జిల్లా ఉపాధ్యక్షులు టీఎస్ చక్రవర్తి, జిల్లా నాయకులు అడపాల నాగేందర్, రాజేంద్రప్రసాద్, ఎస్కె జానీపాషా, కాపర్తి నరేంద్ర, నాయకులు వల్లూరి సంతోష్, కరీష అశోక్, హుస్సేన్, మోహన్, పానకాలరావు, మందుల ఉపేందర్, సాయి, పులి శ్రీను, ఉపేందర్, వెంకట కృష్ణారావు, ఖాసీం, రోషిరెడ్డి, నరేష్, ఆంతోటి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధు, యాదగిరి, రామచంద్రరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వనమాకు సుప్రీంకోర్టులో ఊరట

(మొదటి పేజీ తరువాయి)

4 నెలల సమయమే ఉన్న ఈ తరుణంలో హైకోర్టు తీర్పు తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఇదిలా ఉండగా, రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

**వనమా స్పందన ...**

సీనియర్ రాజకీయ నాయకులు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సుప్రీంకోర్టు స్టే సమాచారం అందిన తర్వాత భావోద్వేగానికి లోనయ్యారు. కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల నుండి ఏ శక్తి తనను దూరం చేయలేదని, 40 ఏళ్ళుగా కొత్తగూడెం ప్రజల కోసం తాను శ్రమించానని, వారు కూడా తనను గుండెల్లో పెట్టుకొని కాపాడుకున్నారని, బీసీ నేతనైన తనపై ఎన్నో కుట్రలు జరిగాయని, కష్టం వచ్చిన ప్రతిసారి నియోజకవర్గ ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు తనకు అండగా నిలిచారని వనమా తెలిపారు తన తుది శ్వాస వరకు కొత్తగూడెం ప్రజల సంక్షేమం కోసం కష్టపడి పని చేస్తానని, కొత్తగూడెం గడ్డపై ఇక్కడి ప్రజల ఒడిలో ఆనందంగా విశ్వాస బదులు తనని వనమా ఉద్వేగంతో తెలిపారు. న్యాయస్థానాలపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, తనపై కుట్రలు కుతంత్రాలు చీకటి రాజకీయం జరిగిన ప్రతిసారి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ లు తనకు అండగా నిలబడ్డారని వారికి జీవితాంతం రుణపడి ఉంటానని వనమా తెలిపారు.



**వనమా అభిమానుల సంబరాలు.....**

తెలంగాణ హైకోర్టు వనమాను అనర్హుడిగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు నాలుగు వారాలు పాటు స్టే విధించిన నేపథ్యంలో కొత్తగూడెంలో వనమా అభిమానులు భారీగా సంబరాలు నిర్వహించారు. కొత్తగూడెం చిల్డ్రన్ పార్క్ ఎదురుగా, కొత్తగూడెం పట్టణంలో పలుచోట్ల బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు.

# ఎస్సీ స్మశాన వాటికలో తాగునీటి బోరు

**ఎర్రుపాలెం , ఆగస్ట్7 మనం న్యూస్):** ఎర్రుపాలెం మండలం మామునూరు ఎస్సీ స్మశాన వాటికలో ఎర్రుపాలెం మండల ఎంపీపీ దేవరకొండ శిరీష నిధుల నుండి చేతిపంపు కోసం వేసే బోరుకు ఎంపీపీ చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సాంబశివరావు , యాకోబు , వెంకన్న , బాలరాజు , ఏసోబు ఏబు , పెద్ద బాబు , బాలాజీ మరియు మామునూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జ్వరాలతో బాధపడుతున్న సోంపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు

## మనం కథనానికి స్పందన



**బూర్గంపహాడ్ ఆగస్టు 7 (మనం న్యూస్):** తీవ్ర జ్వరాలతో బాధపడుతున్న సోంపల్లి అని మనం పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు బూర్గంపాడు జడ్పిటిసి శ్రీలత సోంపల్లి ని సందర్శించి జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వై ద్యాధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో హెల్త్ క్యాంపు లో నిర్వహించారు. వెంటనే అక్కడకి చేరుకొని ప్రజలతో మాట్లాడి పరిస్థిని తెలుసుకున్నారు. పాల్వంచ ఆరోగ్య కేంద్రం లో సోంపల్లి గ్రామానికి చెందిన వారు చికిత్స పొందుతున్నారు అని హాస్పిటల్ కి చేరుకొని అనారోగ్యం తో ఉన్నవారిని పరామర్శించారు, ఆరోగ్యంతో బాధపడుతున్న వారికి బ్రేడ్లు, పండ్లు అందజేసినారు, ఎవరు బయపడకండి అని ధైర్యం చెప్పారు. ఆరోగ్య శాఖ సిబ్బంది తో మాట్లాడి తగిన జాగ్రత్తలు తీసుకొమ్మని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, గ్రామం కమిటీ అధ్యక్షులు బూరం శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ తోకల అనిత, గాదె నర్సిరెడ్డి, ధనుగూరి నాగేశ్వరరావు, పండగ రాములు, బర్ల జోషి, జక్కారెడ్డి మల్లారెడ్డి, బంజార వార్డ్ మెంబర్ కామిరెడ్డి పద్మ, పాల్గొన్నారు

# అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న ప్రధానోపాధ్యాయులు

### – తొలగించిన మహిళా కార్మికులను విదుల్లోకి తీసుకోవాలి
### – మిడ్డేమీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి



**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్ట్ 7 (మనంప్రతినిధి):** న్యాయమైన సమస్యల పరిష్కారంకోసం పది రోజులు సమ్మె చేస్తే విధుల నుంచి తొలగించి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి ప్రశ్నించారు. తొలగించిన కార్మికులను విదుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం మిడ్డే మీల్స్ జిల్లా సూపరింటెండెంట్, డీఈవో, ఎంఈవోలకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి యుపిఎస్ పాఠశాలలో పాండ్ల రోశమ్మ, చాకిరీ సాంబ అనే ఇద్దరు మహిళలు మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్నారని, ఈ పథకం ప్రారంభం నుంచి సుమారు 22 సంవత్సరాలుగా ఎలాంటి రిమార్కు లేకుండా పనిచేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం రూ.3 వేలు చెల్లిస్తానని, ఇతర సమస్యలు పరిష్కరిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన హామీ అమలులో జాప్యం జరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పూనుకున్నామన్నారు. అన్ని పాఠశాలల కార్మికులతో పాటు పెనుబల్లి యుపీఎస్ పాఠశాల మిడ్డేమీల్స్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారన్నారు. పాఠశాల భాద్యులుగా ఉన్న ప్రధానోపాధ్యాయురాలు సమ్మెలో పాల్గొన్నారనే సాకుతో విధుల నుంచి తొలగించి కొత్తవారిని నియమించారని, ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు కార్మికులకు జరిగిన అన్యాయంపై స్పందించి తిరిగి విధుల్లోకి తీసుకునేలా చొరవ తీసుకోవాలని, విధుల నుంచి తొలగించి ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి రేగళ్ల వంటకార్మికులకు జరిగిన అన్యాయంపై పోరాడుతున్నామని, తాజాగా పెనుబల్లి పాఠశాల విషయం తమదృష్టికి వచ్చిందని అన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బాదితులు పాండ్ల రోశమ్మ, చాకిరీ సాంబ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా గాయకుడు గద్దర్ కు నివాళి

### సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు..



**ఇల్లందు, ఆగస్టు 07 (మనం న్యూస్):** ఇల్లందు ఎంపీడీవో కార్యాలయం ప్రారంభంలో సోమవారం గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె శిబిరం వద్ద సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఆవునూరి మధు గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ ఆవు నూరి మధు మాట్లాడుతూ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందిన కవి, ప్రజావాగ్గేయకారుడు. గద్దర్ తన ఆటపాటలతో ప్రజలను విశేషంగా ఆకర్షించాలని, మరి ముఖ్యంగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో వందలాది విప్లవ పాటలు రాసి వినిపించిన గొప్ప కళాకారుడని కొనియాడారు. అనేక ప్రజా కళారూపాలతో ప్రజలను విప్లవ మార్గంలో చైతన్యవంతంగా నడిపించడానికి కృషి చేశాడని, ప్రజా సంస్కృతి, ప్రజాకళలపట్ల ఎంతో మక్కువ కనబరిచాడని కొనియాడారు. ప్రజలను గొప్పగా ప్రభావితం చేసిన గద్దర్ సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో కొనసాగి చివరి దశలో తన విప్లవ రాజకీయ అవగాహన నుండి వైదొలిగి బూర్జువా రాజకీయాలకు ఆధ్యాత్మిక భావాలకు లోనయ్యాడని వివరించారు. ఆయన మరణం సాంస్కృతిక ఉద్యమానికి,ప్రజా కళలకు తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణానికి సంతాపం తెలిపి వారి కుటుంబానికి సానుభూతిని తెలుపారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు కొక్కు సారంగపాణి,తోడేటి నాగేశ్వరరావు, బానోత్ రాంసింగ్,జిల్లా నాయకులు జటంగి వెంకన్న,తొగర సామెల్ తదితరులు పాల్గొన్నారు....

# నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి



**ఏన్కూరు, ఆగస్టు 7(మనం న్యూస్):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మండల ఎంపీపీ ఆరేం వరలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని మూలపోచారం, రంగాపురం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. భారీ వర్షాలకు మండలంలో చాలాచోట్ల పంటలు కొట్టుకుపోయాయని, ఆ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అదేవిధంగా భారీ వరదలకు దెబ్బతిన్న మూలపోచారం-రంగాపురం గ్రామాల మధ్య ఉన్న లో లెవెల్ బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జి ధ్వంసం కావడంతో ఇరు గ్రామాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని వెంటనే మరమ్మతులు చేయాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. అనంతరం మూల పోచారం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. భోజనం, వసతి వంటి తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోని స్లాబ్ పెచ్చుకలు ఊడి పడుతున్నాయని, విద్యార్థులకు హాని కలగకుండా వాటికి మరమ్మత్తులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఆరేం రామయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రోకటి లక్ష్మీ నరసింహారావు, పార్టీ మండల అధ్యక్షుడు కొనకంచి రామకృష్ణ, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# కోర్టు నందు గద్దర్ మృతికి సంతాపం



**మధిర,ఆగస్ట్7(మనం న్యూస్):** పీడిత ,తాడిత వర్గాల తరపున జీవితమంతా పోరాడి ప్రజా యుద్ధ నౌకగా గుర్తింపు పొంది అణగారిన వర్గాల తరపున ప్రశ్నించే గొంతుకై, నిరంతరం పోరాడిన యోధుడు, గద్దర్ మృతికి సంతాపముగా మధిర బార్ అసోసియేషన్ న్యాయవాదులు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు .ఈ కార్యక్రమంలో మధిర కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి టీ .కార్తీక్ రెడ్డి, న్యాయవాదులు, ఏపీపీ నాగలక్ష్మి మరియు కోర్టు సిబ్బంది ఉన్నారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**మణుగూరు, ఆగష్టు 7 (మనం న్యూస్)** :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సమితి సింగారం లోని పద్మశాలి సంఘం భవనంలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని . పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి మండల అధ్యక్షులు డా' దుస్సా సమ్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినారు. పూజా కార్యక్రమాల అనంతరం డా' సమ్మయ్య మాట్లాడుతూ, భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రధానమైన చిహ్నాలలో చేనేత రంగం ఒకటి. ఆనాటి స్వాతంత్ర ఉద్యమంలో గాంధీ నూలు వడుకుతూ ఉద్యమానికి ఊపిరి పోశారు. స్వదేశీ ఉద్యమంలో కీలకపాత్ర పద్మశాలీలదే అయితే చేనేతలు మన దేశంలో ఎప్పటికీ ఎదగలేకపోతున్నారని, నిరాశకు గురవుతున్నారని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం .చేనేతలు సమాజానికి చేసిన సహకారాన్ని గుర్తించడానికి, ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీన చేనేత దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుంది.అని ప్రస్తావించారు. మన ఐక్యతతో మన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రతి ఒక్కరూ సంఘటితంగా పోరాడి మన హక్కులను మనం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు మీద ఉన్నదని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ కోట శ్రీనివాస్, మహేశ్వరపు రమేష్, రుద్ర నాగరాజు, కొలిపాక ప్రభాకర్, తాడి సత్యనారాయణ, వెన్న వెంకట్రావు, తుమ్మ లక్ష్మీనారాయణ, పసునూటి రమేష్, చాడ శ్రీనివాస్, ఆమంచి ప్రసాద్, కానూరి శ్రీనివాస్, కుల బాంధువులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ ఎస్పీ

**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్ట్ 7 (మనంప్రతినిధి)** : ప్రతి నెలా ఒకటో తారీఖున జరగాల్సిన 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన ఈ నెల జరగలేదు, కావున నేటి ఉదయం 11.30 గంటల నుండి 12.30 గంటల వరకు డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జి తెలియజేసారు. కావున జిల్లా ప్రజలు 08744-243666 నెంబర్ కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలపాలని ఎస్పీ కోరారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపండి : కలెక్టర్ ప్రియాంక అల

**భద్రాద్రి కొత్తగూడెం ఆగష్టు 07 (మనంప్రతినిధి) :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక తెలిపారు . సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిర్యాదు స్వభావాన్ని పిర్యాదుదారునికి లిఖితి పూర్వకంగా తెలియచేయాలని ఆదేశించారు . ప్రజావాణిలో సమస్య పరిష్కరించాలని ప్రజలు అందచేసిన పిర్యాదులు ముఖ్యమైనవికొత్తగూడెం మండలం , మేదరబస్తీకి చెందిన బి కమలాబాయి రైల్వే అధికారులు ఇళ్లు కూల్చిన సందర్భంగా విచారణ నిర్వహించి రెండు పడకగదుల ఇల్లు కానీ , ఇంటిస్థలం కాని ఇస్తామని హామీ ఇచ్చారని , నేటి వరకు మంజూరు చేయలేదని పేర్కొంటూ అందచేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం మున్సిపల్ కమిషనర్కు ఎండార్స్ చేస్తూ విచారణ నిర్వహించి నివేదికలు అందచేయాలని ఆదేశించారు . పాల్వంచ మండలం , ఇల్లందులపాగుతండాకు చెందిన జి రాము తన కుమారుడు దినేష్ కార్తిక్ దమ్మపేట ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకున్నాడని , అనారోగ్య కారణాల వల్ల అక్కడి నుండి టిసి తీసుకోవడం జరిగిందిని , కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేని కారణంగా తిరిగి మళ్లీ హాస్టల్లో జాయిన్ చేపించేందుకు పాల్వంచ ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలో 8 వ తరగతిలో సీటు ఇప్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఎస్సీ రెసిడెన్షియల్ జిల్లా కో ఆర్డినేటర్కు ఎండార్స్ చేశారు . కో చుంచుపల్లి మండలం , ములుగుగూడెం గ్రామానికి చెందిన సడియం ముత్తమ్మ పెనగడప రెవిన్యూ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లులో తనకు 4.30 ఎకరాల భూమి కలదని , సర్వే నెం . 366 / 51 లోని 2.16 ఎకరాల భూమికి పంచనామా నిర్వహించి హద్దులు కేటాయించాల్సిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం చుంచుపల్లి తహసిల్దార్కు



ఎండార్స్ చేశారు . బూర్గంపాడు మండలం , ఉప్పుసాక గ్రామానికి చెందిన గంగిరెడ్డి సురేందర్ రెడ్డి తన చేను ప్రక్కన లోతువాగు ఉండటం వల్ల వర్షాలకు ప్రక్కనున్న పట్టా భూమి కోతకు గురవుతున్నదని , ఇప్పటి వరకు సుమారు 3 ఎకరాల భూమి కోతకు గురైందని , ఆ వాగుపై చెక్ డ్యాం నిర్మించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం జిల్లా ఇరిగేషన్ అధికారికి ఎండార్స్ చేశారు . కొత్తగూడెం మండలం , కూలిలైన్ కు చెందిన రౌతు సురేష్ కుమార్ తన తల్లిదండ్రులు మరణించి చాలా కాలం అయిందని , తనకు సొంతిల్లు కూడా లేదని , ప్రైవేట్ కారు డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని , దళితబంధు పథకం క్రింద కారు ఇప్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం ఎస్సీ కార్పోరేషన్ ఈడికి ఎండార్స్ చేశారు . పాల్వంచ మండలం , జగన్నాధపురం గ్రామానికి చెందిన గుగులోత్ సూర్యం తన కూతురు యోక్షిత 5 సంవత్సరాలు , ఎడమ కాలుకు బోన్ క్యాన్సర్ సోకడం వల్ల గత సంవత్సరం సర్జరి చేపించామని , ఇప్పుడు అదే కాలు మెలి తిరగడం వల్ల నడవలేని స్థితిలో ఉందని , ఉన్న కొద్దిపాటి పొలం అమ్మి వైద్యం చేయించామని తన కూతురుకు పించనుతో ఆర్థిక సాయం అందించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం జిల్లా వైద్యాధికారికి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారికి ఎండార్స్ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్ రాజు , అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి

## చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి గర్భిణీ స్త్రీలకు చీర సారె తో సత్కారం



**ఇల్లందు, ఆగస్టు 07 (మనం న్యూస్):** ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో సోమవారం 24 వ వార్డు లో ఐసిడిఎస్ వారి నేతృత్వంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమానికి 24 వ వార్డు కౌన్సిలర్ వాంకుడోత్ తారా, ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చిన్నారులకు అన్న ప్రసన్నం అక్షరం బ్యాసం చైర్మన్ చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు చీరె సారె తో సత్కరించి పండంటి బిడ్డకు జన్మనియ్యాలని ఆశీర్వదించారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ చైర్మన్ మాట్లాడుతూ ఐ సి డి ఎస్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని కొనియాడారు. తల్లిపాలతో ఎన్ని ఉపయోగాలు ఉంటాయో ప్రతి ఇంటికి తెలిసేలా కార్యక్రమాలు విరి విరివిగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ద్వారా ఏ పథకమైన ప్రజల వద్దకు చేరాలంటే అంగన్వాడి టీచర్ల సహకారం ఏనలేనిదని కొనియాడారు. ప్రభుత్వం అందించే పౌష్టికారం బాలింతలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# దొంగలను పట్టించిన సీసీ కెమెరాలు

## ఇద్దరు సెల్ ఫోన్ దొంగలను అరెస్ట్ చేసిన భద్రాచలం పోలీసులు

## లక్షన్నర రూపాయల విలువైన ఒక లాప్ టాప్ 5 సెల్ ఫోన్లు రికవరీ




**భద్రాచలం, ఆగస్టు 7( మనం న్యూస్ ) :** భద్రాచలం ఏఎస్పీ పరితోస్ పంకజ్ ఆదేశాల మేరకు, భద్రాచలం పట్టణ పరిసర ప్రాతాల లోని ఇండ్ల లోసెల్ ఫోన్ ల దొంగతనాలు జరుగు తున్నాయని, సమాచారం తో భద్రాచలం బస్ స్టాండ్ వద్ద తనిఖీలు చేయగా, భద్రాచలం పట్టణానికి చెందిన మైపా నవీన్ చెంగల సాయికుమార్ లు పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకు తిరుగుతున్న దొంగలను చాకచక్యంగా సి సి కెమెరా ల సహాయం తో అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఒక లాప్ టాప్ 5 సెల్ ఫోన్ లను రికవరీ చేయడం జరిగింది. నిందితులను రిమాండ్ కు తరలించారు. అరెస్టు చేసిన భద్రాచలం పోలీసులను ఏఎస్పీ పారితోష్ పంకజ్ అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో భద్రాచలం టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు..



# గద్దర్ అకాల మరణానికి ప్రజాసంఘాల నివాళి

**ఇల్లందు, ఆగస్టు 07 (మనం న్యూస్):** టేకులపల్లి మండల కేంద్రంలో సోమవారం ప్రజా కవి ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘల నాయకులు మాట్లాడుతూతెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన గద్దర్ అన్న లేని లోటు ఎవరి భారత దేశ పీడిత ప్రజలకు తీరనిలోటు అని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారురేపు ఉదయం 11:00 గంటలకు పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధ నౌక ప్రజా గాయకులు గద్దర్ అన్నకు నివాళులర్పించే కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు., ఈ కార్యక్రమంలో జిల్లాకాంగ్రెస్ నాయకులు లక్కినేని సురేందర్ రావు, గుడిపూడి సత్యనారాయణ,టీడీపీ నాయకులు గుడిపూడి మోహన్ రావు , కమ్యూనిస్టు నాయకులు ధర్మపురి బ్రహ్మాచారి , పిఎసిఎస్ డైరెక్టర్ ఉల్లోజు ఉదయ్ చంద్ర, కాంగ్రెస్ మండల నాయకులు బోడ మంగిలాల్ నాయక్ , ఇస్లావత్ మంగ నాయక్, మధు రెడ్డి , కమ్యూనిస్టు న్యూ డెమోక్రసీ నాయకులు కల్తీ వెంకటేశ్వర్, బాను చందర్ , వైయస్సార్ టిపినాయకులు నర్సింగ్ లక్ష్మయ్య ,హమాలి నాయకులు మంచ్య నాయక్ , చిరు, వ్యాపారవేత్తలుతదితరులు పాల్గొన్నారు..,



# గద్దర్ మృతికి బార్ నివాళి

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 7 (మనం ప్రతినిధి) :** ప్రజా యుద్ధనౌక ప్రజా గాయకుడు గద్దర్ కు సోమవారం కొత్తగూడెం భారత్ అసోసియేషన్ ఘనంగా నివాళులర్పించింది. సీనియర్ న్యాయవాదులు లక్కినేని సత్యనారాయణ, జలసూత్రం శివరాం ప్రసాద్ ఇచ్చిన ప్రతిపాదన మేరకు సోమవారం కొత్తగూడెం భార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దుంద్ర రమేష్ న్యాయవాదులతో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. గద్దర్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు న్యాయవాదులు గద్దర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ కాసాణి రమేష్ ,యాసా యుగంధర్, సంతోష్ లాల్ సాహూ, పిట్టల రామారావు, అత్తులూరి మనోరమ తదితరులు పాల్గొన్నారు.

# డీలర్ల సమావేశం

**అన్నపురెడ్డిపల్లి , ఆగస్టు 07(మనం న్యూస్) :** మండల తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2:00 గంటల సమయంలో డీలర్ సమావేశం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి డీలర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటిస్తూ, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని కోరారు.అలానే స్టాక్ బోర్డు లో వివరాలు ఓపెనింగ్ బ్యాలెన్స్, క్లోజింగ్ బ్యాలెన్స్, ఎఫ్ ఎస్ సి, ఏ ఎఫ్ ఎస్ సి రేషన్ కార్డు వివరాలు తప్పనిసరిగా నోటీసు బోర్డు లో వుంచాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ మధు, యు డి సి సత్యనారాయణ, రేషన్ డీలర్లు జిసిసి సేల్స్ మాన్ బి బాలు, రాఘవులు, లాలయ్య, పద్మ, రాజమ్మ,రాణి, టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**కరకగూడెం ఆగస్టు 7 (మనం న్యూస్):** కరకగూడెం మండలం పద్మాపురం అనంతరం గ్రామ పంచాయతి పరిధిలోని అంగన్వాడీ సెంటర్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతారం సెక్టార్ సుజాత మాట్లాడుతూ. బిడ్డకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి అని బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని ఆ పాలలోనే వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఆమె తెలియజేశారు అలాగే తల్లిపాలు పట్టించడం వల్ల అనారోగ్యాల బారిన బిడ్డ పడకుండా కాపాడుకోవచ్చని అలాగే బిడ్డ మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనురాధ స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి రాము స్కూల్ టీచర్ గర్భిణీలు, బాలింతలు, పాల్గొన్నారు.

# గద్దర్ కు ఘనంగా నివాళులు అర్పించిన టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి



**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్ట్ 7(మనం ప్రతినిధి) :** కొత్తగూడెం రైటర్ బస్తిలో గల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ అధ్వర్యంలో ప్రజి గాయకుడు గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎడవల్లి మాట్లాడుతూ, గద్దర్ మరణం తెలంగాణ రాష్టానికి తీరని లోటని, తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర చాలా కీలకమని, అనేక పాటలు పాడి తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేశాడని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో తన పాట 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా' అనే పాటా యువతను చైతన్య వంతం చేసిందని, పాలకుల ప్రజా వేతిరేక విధానాలపై ప్రజా సమస్యల పై జరిగే ఉద్యమాలకు గద్దర్ స్వరం ఆయుధంగా మారిందని, అలాంటి గొంతుక ముగ బోవడం ఉద్యమాలకు తీరని లోటుగా ఎడవల్లి కృష్ణ అభివర్ణించారు . తెలంగాణ రాష్ట్రం కోసం తాను ఎంత పాటు పడ్డాడో రాష్టం ఏర్పడ్డాక పాలను చూసి చాలా ఆవేదనకు గురి అయ్యాడని, గద్దర్ ఆత్మకి శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు ఎడవల్లి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమవములో:సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్యా,చుంచుపల్లి మండల అధ్యక్షులు అంతోటి పాల్,బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు,కొత్తగూడెం పట్టణ యస్సీ సెల్ అధ్యక్షులు కళ్లేపల్లి రాజు,చుంచుపల్లి మండల యస్సీ సెల్ అధ్యక్షులు శనగ లక్ష్మణ్,పాల్వంచ బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు చారి,కాంగ్రెస్ నాయకులు పాంచాల నాగభూషణం, వెలెటి వెంకటేశ్వర్లు,రామ్ నాయక్,ఫైజుద్ధిన్, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం టెండర్లలో బినామీలకు అవకాశం ఇవ్వద్దు



**దమ్మపేట, ఆగష్టు 7(మనం న్యూస్) :** దమ్మపేట గ్రామంలో జరిగిన సమావేశంలోప్రభుత్వం ప్రకటించిన మద్యం టెండర్ల ప్రక్రియలో బినామీలకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకూడదని , అశ్వారావుపేట నియోజక వర్గ గౌడ సంఘం తీర్మానించింది . దమ్మపేట గౌడ సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం ఆ సంఘ సమావేశం జరిగింది . ఈ సమావేశంలో ఆసంఘ భాద్యులు,, పెద్దలు ,పానుగంటి సత్యం , యార్లగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజక వర్గంలోని అశ్వారావుపేట , దమ్మపేట , చంద్రుగొండ , అన్నపురెడ్డిపల్లి , ములకలపల్లి మండలాలలో ఒక్క దమ్మపేటలో ఒక్క మద్యం షాపుకు మాత్రమే గౌడ కులస్తులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించిందని , ఈ షాపుకు నియోజక వర్గంలోని ఐదు మండలాల గౌడ సామాజిక వర్గం కు చెందిన వారు అందరూ ఒక్కటై , ఒక్క తాటి మీదకు వచ్చి టెండర్లు వేయాలని సమావేశం తీర్మానించింది . అలాగే పక్క జిల్లాలోని టెండర్లలో అశ్వారావుపేటకు చెందిన వారు జోక్యం చేసుకోకూడదని , మన జిల్లాలో పక్క జిల్లా వాళ్ళు టెండర్ల విషయంలో జోక్యం చేసుకోరాదని సమావేశం తీర్మానించింది . టెండర్లు వేసినా కలసి ప్రయాణం చేయాల్సిందే అని అన్నారు .ఇప్పటికైనా గౌడ కులస్తులందరూ ఒక్క తాటి పైకి వచ్చి , ఐక్యతను చాటి మద్యం టెండర్లలో దమ్మపేట షాపును దక్కించుకోవాలని సూచించారు . ఈ సమావేశంలో ఐదు మండలాల, అశ్వారావుపేట మండలం, తాళం సూరిబాబు ,చంద్రుగొండ మండలం, బొర్రా కేశవులు, ములకలపల్లి మండలం ,నరాటి ప్రసాద్ ,అనప రెడ్డి పల్లి మండలం ,పరస వెంకట్, దమ్మపేట ,మండలం కాసాని ప్రసాద్, గౌడ సంఘం భాద్యులు పాల్గొన్నారు .

# గద్దర్ కు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఘననివాళి



**బూర్గంపహాడ్, ఆగస్టు 7 (మనం న్యూస్):** ప్రజాకవి గద్దర్ మరణించడంతో యావత్ ప్రజాగళం మూగబోయినట్లు అయిందని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ సబ్ డివిజనల్ నాయకులు డి పునంచంద్ అన్నారు. ఆదివారం గద్దర్ మృతిచెందడం తో ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగంలో చేరి ప్రజా సమస్యల పోరాటానికి ఉద్యోగాన్ని వదిలి ఉద్యమ బాట పట్టారన్నారు.ఎందరో నిరుపేదలకు దిక్సూచిగా సేవలందించరన్నారు ఎన్నో నిర్బంధాలను ఆటుపోట్లను ఎదుర్కొని పోరాడిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. తన ఆటపాటలతో అద్భుతమైన చైతన్యని యావత్ ప్రజానీకానికి ఒక దిక్సూచిగా నిలిచారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తన గళంతో రాష్ట్ర ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించి తన వంతు కృషి చేశారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ భౌతిక కాయాన్ని ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించి ఆయన కుటుంబాన్ని అన్ని విధాల అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయి పుల్లయ్య కొమ్ము పాపయ్య రావులపల్లి రాములు ఎడారి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులకు ఖండన : ఇఫ్టూ



**ఇల్లందు, ఆగస్టు 07 (మనం న్యూస్):** ఇల్లందు జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం గత 36 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జేఏసీ నాయకులు 60 మంది కార్మికుల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు కలుగజేసుకొని శాంతియుతంగా నిర్వహిస్తున్న రాస్తారోకోని అడ్డగించి 60 మంది కార్మికులను మద్దతు తెలిపిన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులతోపాటు ఇతర సంఘ నాయకులు కూడా అరెస్టు చేశారు. తీవ్రంగా ఖండించిన నాయకులు. నాయకులు గత 35 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 60 వేలమంది గ్రామపంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెలో ఉన్నారు.కార్మికుల సమ్మె ఫలితంగా 12,769 గ్రామపంచాయతీలలో పనులన్నీ స్తంభించిపోయాయి. తెలంగాణ పల్లెలన్నీ చెత్తా చెదారంతో మురుగునీరులతో దోమలు ఈగలతో కునారిల్లు తున్నాయి.గ్రామీణ ప్రజలు అనారోగ్యాల బాలినథయఘశ్త పడుతున్నారు.ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మెను పరిష్కరించేందుకు ప్రభుత్వం పూనుకోకుండా 60 వేలమంది కార్మికుల కుటుంబాలను బజారున పడేసింది.ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని



వ్యతిరేకిస్తూ సమస్యలను పరిష్కరించి న్యాయం ఊబుచేయాలని కోరుతూ కార్మికులు ఇల్లందులో శాంతియుతంగా రాస్తారోకో నిర్వహిస్తుండగా పోలీసులు 60 మంది కార్మికులతో పాటు కార్మికులకు మద్దతుగా ప్రదర్శనలో పాల్గొన్న ఐ ఎఫ్టియు జిల్లాకార్యదర్శి బి.రాంసింగ్, కే.సారంగపాణి,సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు. అవునూరి మధు తదితర ప్రజా సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐ ఎఫ్ టి యు)తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. అక్రమంగా అరెస్టు చేసిన కార్మికులను నాయకులను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

# మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కలిసిన ఎమ్మెల్యే మెచ్చా



**దమ్మపేట, ఆగష్టు 7(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర దేవదాయ, అటవీశాఖ మంత్రివర్యులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్వే జరిగినప్పటికీ పలువురికి పోడు భూమి పాస్ పుస్తకాలు అందకపోవడం గురించి అలాగే పలు ఆలయాల అభివృద్ధి గురించి మంత్రి దృష్టికి తీసుకెల్లారు.సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.బోయినపల్లి సుధాకర్ రావు మరియు మోటురి మోహన్ వారి వెంట ఉన్నారు.అనంతరం హైదరాబాద్ లో ఐ టి డి ఏ సి ఇ గారిని మెచ్చా నాగేశ్వరరావు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అత్రం సక్కు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు సమస్యలపై మరియు జరగాల్సిన అభివృద్ధి గురించి వారితో చర్చించారు.

# ప్రధాన రహదారిపై పంచాయతీ కార్మికుల రాస్తారోకో

## సిపిఐ, న్యూ డెమోక్రసీ పార్టీల మద్దతు



**ఆళ్లపల్లి, ఆగస్టు 7 (మనం న్యూస్):** గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె 33 వ రోజుకు చేరినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎటువంటి హామీ లేకపోవడంతో మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల రాష్ట్ర సమితి పిలుపుమేరకు బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో సందర్భంగా మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఒక గంట పాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 33 రోజుల నుండి పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి ఏమాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని తక్షణమే ప్రభుత్వం మా యొక్క సమస్యలను పరిష్కరించాలని లేకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. సిపిఐ, న్యూ డెమోక్రసీ పార్టీల నాయకులు రాస్తారోకోలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఆళ్ళపల్లి వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య మాట్లాడుతూ పంచాయతి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్కే రహీం, న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు బత్తిని సత్యం , వార్డు మెంబర్లు సుశీల, సురేందర్, పంచాయతీ కార్మికులు ప్రభుదాస్ మల్కాపురి శేఖర్, ముసలయ్య ఏలియా కుమారి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.స్థానిక ఎస్ఐ రతీష్ ఆదేశాల మేరకు రాస్తారోకో ను ఏఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ వి.రాజేశ్వర్ రావు, కానిస్టేబుల్ వై.శ్రీనివాస్ రావు అడ్డుకొని వాహనాలను యధావిధిగా ప్రయాణం సాగించేలా చేయడం జరిగింది.

# అమ్మపాలు అమృతం

**ఖమ్మం, ఆగష్టు 7(మనం న్యూస్) :** ఖమ్మం నగరంలో 58వ డివిజన్లో గల బి.సి. కాలనీ అంగన్వాడీ సెంటర్లో ఐ.సి.డి.ఎస్. సూపర్వైజర్ సుధభవాని ఆధ్వర్యంలో సోమవారం నాడు తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గర్భిణి స్త్రీలకు, బాలింతలకు, తల్లులకు తల్లిపాల ఆవశ్యకతను గురించి వివరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ ఉమ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని, పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, 6 నెలలు వరకు కేవలం తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని, 6 నెలల తరువాత 2 సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు పౌష్టికాహారం ఇవ్వాలని, తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిబిఈ ప్రోగ్రామ్ అక్షరాభ్యాసం కూడా నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఉమ, సహాయకురాలు కస్తూరి, బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు విజయ మరియు గర్భిణీలు సంధ్య, రాణి, బాలింతలు రవళి, మేఘన, తల్లులు మమత, ఉష, కళ్యాణి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



